

ఉత్పత్తులను పరిశీలిస్తున్న సామాజిక వేత్త కాజల్ లిఖానీ

కళింగ కల్చరల్ హాల్‌లో జాతీయ చేనేత ప్రదర్శన

బంజారాహిల్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన 20 25, శనివారం సామాజిక వేత్త కాజల్ లఖానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. నేటికి వీటికి వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ, నవంబరు 23 వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.



కన్వెన్షనల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

20 రోజుల్లోగా పనులను పూర్తి చేయాలి

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఎన్‌బీటీ నగర్ రోడ్ నం.12లో నిర్మాణంలో ఉన్న జీహెచ్‌ఎంసీ కన్వెన్షనల్ హాల్ పనులను శనివారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా 20 రోజుల్లోగా నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, ప్రైవేటు కల్యాణ మండపాల కారణంగా పేదలపై ఆర్థిక భారం పడుతుందని, జీహెచ్‌ఎంసీ కన్వెన్షనల్ సెంటర్ ఇలాంటి వారికి ఎంతో దోహద పడుతుందన్నారు. అన్ని వసతులను ఇందులో సమకూర్చినట్లు చెప్పారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలకు దీన్ని అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడించారు. త్వరలో ఈ హాల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులతో కలిసి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

దక్షిణ భారతానికి అన్ని రంగాల్లో అన్యాయం



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

పంజాగుట్ట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): దేశంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గుతుందని ఏపీ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షురాలు, శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గతంలో బ్రిటీష్ వారు మనల్ని దోచుకుంటే ప్రస్తుతం ఉత్తరాది వారికి దోచి పెడుతున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికే అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని.. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గుతాయని, ఉత్తరాది వారు అన్ని విధాలా చిన్నచూపు చూడడమే కాకుండా నిర్ణయాలు తీసుకోవడంలో దక్షిణాది వారికి ఎలాంటి ప్రాధాన్యత ఉండదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఉత్తరాది వారే తన్నుకుపోతుంటే, దక్షిణాది యువత నిరుద్యోగులుగానే ఉంటున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జె.శుభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



తెలంగాణ సౌర రైతుల సాధికారిక సమ్మేళనం-2025 కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ పీఎం కుసుమ్ రైతుల సంఘం ప్రతినిధులు

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'సౌర రైతుల' సమ్మేళనం

పంజాగుట్ట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయానికి అనుకూలంగా లేని భూములలో సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ఇప్పటికే విద్యుత్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్న రైతుల కోసం నగరంలో ప్రత్యేకంగా తెలంగాణ సౌర రైతుల సాధికారిక సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలంగాణ పీఎం కుసుమ్ సౌర రైతుల సంఘం సలహాదారు బి.సంతోష్ రావు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు ఆదినారాయణ రాజు, పి.గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమేష్‌లతో కలిసి ఈ నెల 16,17 తేదీలలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించనున్న సమ్మేళనం-2025 కరపత్రాన్ని ఆవిష్కరించారు.



ఎల్లమ్మ ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న అర్చక సిబ్బంది

బల్కంపేట ఎల్లమ్మ ఆదాయం రూ, 79లక్షల పైనే

అమీర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం హుండీలను శనివారం లెక్కించారు. 73 రోజులకు సంబంధించి 18 హుండీల ద్వారా రూ.79,35,567 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో శేఖర్ వెల్లడించారు. జనరల్ హుండీలలో రూ, 77,82,210 లక్షల ఆదాయం రాగా అన్నదానం హుండీలో రూ.1,53,357 లక్షలు వచ్చాయి. దీంతో పాటు 195 యూఎస్ డాలర్లు, 2 ఖతర్ రియాల్స్, 70 కెనడా డాలర్స్, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పర్యవేక్షణలో ఉదయం 10 గంటలకు మొదలైన లెక్కింపు సాయంత్రం 6 గంటలకు ముగిసింది.

గుండెపోటుతో వ్యక్తి మృతి

యూసుఫ్ గూడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో ఓ టీవీ ఛానల్‌లో పని చేస్తున్న సబ్ ఎడిటర్ మృతి చెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన కృష్ణవంశీ ఓ టీవీ ఛానల్‌లో సబ్ ఎడిటర్‌గా పని చేస్తూ మధురానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి విధులు నిర్వహించి ఇంటికొచ్చి నిద్రపోయాడు. శనివారం ఉదయం 8:30కు సోదరుడు నిద్ర లేపే ప్రయత్నం చేయగా లేవకపోవడంతో 108కి సమాచారం అందించాడు. సిబ్బంది వైద్య పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించినట్లు సాయి తేజ మధురానగర్ పోలీసులకు సమాచారం అందించాడు.

మారిన లెక్కలు..



బీఆర్ఎస్‌కు పట్టున్న సెంటర్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ

ఓట్లు రాబట్టుకోవడంలో సక్సెస్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుంటున్న పార్టీలు

బంజారాహిల్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏ తరహా ఎన్నికలు వచ్చినా ప్రజలు తీర్పు విభిన్నంగా ఉంటుంది. పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు అభ్యర్థుల వైపు మొగ్గు చూపిస్తుంటారు. తాజా ఉప ఎన్నికల్లో కూడా ఇదే జరిగింది. సాధారణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలవుతుంది. యేడాదిన్నర క్రితం పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. కానీ అప్పటి ఓటింగ్‌కు ప్రస్తుతం జరిగిన ఓటింగ్‌కు చాలా తేడాలున్నాయి. అప్పుడు ఆ పార్టీలను ఆదరించిన ఓటర్లు ఈ ఎన్నికల్లో ఛీ కొట్టారు. కొన్నిచోట్ల మెజారిటీలో కూడా చాలా వ్యత్యాసాలు వచ్చినట్టు గణాంకాలను బట్టి తెలుస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్‌కు ప్రతీ సెంటర్‌లో భారీ మెజారిటీ అప్పగించిన ప్రజలు ప్రస్తుత ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపించారు. బీఆర్ఎస్ ఏ ఒక్క డివిజన్‌లో కూడా పట్టు నిలుపుకోలేకపోయింది. చివరకు బోరబండ బీఆర్ఎస్ వైపు ఉంటుందని అందరూ భావించారు. కానీ అక్కడ లెక్కలు తారుమారయ్యాయి. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చినన్ని ఓట్లు కూడా రాబట్టుకోలేక బీజేపీ చతికిల పడింది.



ఏడింట పై చెయ్యి

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏడు డివిజన్‌లు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వీటన్నింటిలో బీఆర్ఎస్ పై చేయి సాధించింది. కాంగ్రెస్ రెండవ స్థానం, బీజేపీ మూడో స్థానంలో నిలిచాయి. అయితే ఈ ఎన్నిక అనంతరం ఆరునెలలకు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని డివిజన్‌లలో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోయింది. అప్పటి రాజకీయ సమీకరణాల నేపథ్యంలో నియోజకవర్గం ప్రజలు కాంగ్రెస్‌కు భారీగా ఓట్లు వేశారు. అలాగే బీజేపీకి రెండో స్థానం కట్టబెట్టారు. కాంగ్రెస్‌కు సుమారు 88 వేల ఓట్లు రాగా బీజేపీకి ఏకంగా 68 వేల ఓట్లు వచ్చాయి. కానీ ప్రస్తుత ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి ప్రభావం చూపించగలిగింది. ఏడు డివిజన్‌లలో తనకు తిరుగు లేదని నిరూపించింది.

ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టున్న అన్ని కేంద్రాల్లో భారీ మెజారిటీ సాధించడంలో సఫలీకృతం అయింది. ఎంతలా అంటే ఏ తరహా ఎన్నికలు వచ్చినా అభ్యర్థి 21,000 మెజారిటీకే పరిమితమయ్యారు. కానీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకంగా 24,729 మెజారిటీ సాధించగలిగింది.

బీఆర్ఎస్, బీజేపీలో అంతర్మథనం

ఉప ఎన్నికల్లో అనూహ్య రీతిలో ఓటమి పాలవడంతో బీఆర్ఎస్, బీజేపీలో అంతర్మథనం మొదలైంది. కింది స్థాయి నాయకులు ఓటమికి గల కారణాలపై విశ్లేషించుకునే పనిలో పడ్డారు. వాస్తవానికి పార్లమెంట్ ఎన్నికల్లోనే బీఆర్ఎస్ హవా తగ్గడంపై పార్టీలో కొన్ని గుసగుసలు వినిపించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైపు ప్రజలు మొగ్గు చూపించారు కానీ బీఆర్ఎస్‌కు నష్టమేమీలేదని సీనియర్లు కొట్టి పాడేశారు. ఇప్పుడు ఆ నిర్లక్ష్యమే కొంప ముంచిందని నాయకులు అంటున్నారు. పార్టీకి సారథ్యం వహిస్తున్న నేత మరణం ఇలా ఇబ్బందుల్లోకి నెడుతుందని ఊహించలేదని కార్యకర్తలు వాపోతున్నారు. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో గౌరవ ప్రదమైన 25,000 ఓట్లు తెచ్చుకున్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో సుమారు 68 వేల ఓట్లు సాధించింది. ప్రస్తుత ఉప ఎన్నికల్లో ఈ తరహా ఓట్లపై ఆశలు పెట్టుకుంది. కానీ ఉప ఎన్నికల్లో బీజేపీ తీరును ఓటరు తప్పు పట్టాడు. దీంతో కనీసం డిపాజిట్టు కూడా దక్కించుకోలేకపోయింది.

డివిజన్‌ల వారీగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు పడిన ఓట్లు

	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ	మెజారిటీ
షేక్‌పేట	15,018	13,078	2,373	1,940
ఎర్రగడ్డ	13,828	11,721	2,938	2,107
బోరబండ	14,729	12,247	2,062	2,482
రహ్మత్‌నగర్	21,553	15,528	2,459	6,025
వెంగళరావునగర్	13,039	8,857	2,733	4,182
యూసుఫ్‌గూడ	13,082	8,109	2,442	4,973
సోమాజిగూడ	7,696	4,694	2,034	3,002

పనిచేసిన స్థానికం

నవీన్‌యాదవ్‌కు టికెట్టు కేటాయింపు విషయంలో కాంగ్రెస్‌లోనే అనేక మంది వ్యతిరేకించారు. తండ్రిపై కేసులు ఉన్నాయంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం నవీన్ వైపే మొగ్గు చూపించారు. అధిష్ఠానాన్ని ఒప్పించి టికెట్టు ఇప్పించగలిగారు. అయితే ప్రతిపక్షాలు తండ్రి కేసులను పదే పదే చూపిస్తూ వ్యక్తిత్వంపై దాడి చేశారు. అయినప్పటికి స్పందించని నవీన్ తాను స్థానికుడిని.. సౌమ్యుడిని అనేది తెలిసేలా ప్రచారం చేశాడు. స్థానికం అనే అంశం అతనికి కలిసి వచ్చింది. మొదట అందరూ ప్రతిపక్ష వాదనతో ఏకీభవించిన మన పిల్లగాడే కదా అన్న ధోరణి కనబర్చారు. చివరకు అతని వైపు మొగ్గు చూపించారు. అసెంబ్లీకి మార్గం సుగమం చేశారు.

జర్నలిజం విలువలు కాపాడాలి

నేను ఎదగడానికి కారణం పాత్రికేయులే: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సన్మాన గ్రహీతలు సీనియర్ పాత్రికేయులతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

పంజాగుట్ట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జర్నలిజం చాలా పవిత్రమైంది.. ఈ రంగంలో విలువలు కాపాడాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బండారు వైష్ణవ్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జర్నలిజం రంగంలో విశిష్ట సేవలను అందించిన పలువురు ప్రముఖ జర్నలిస్టులను ఆయన సన్మానించారు. పత్రికారంగంలో నిజాయితీ, నిబద్ధత, విలువలు, వాస్తవాన్ని నిలబెట్టే జర్నలిస్టులను సన్మానించడం తనకు సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తాను గవర్నర్‌గా ఉన్న సమయంలో రాజ్ భవన్‌లో పలువురు జర్నలిస్టులను సన్మానించానని, ప్రస్తుతం అదే సంప్రదాయం కొనసాగిస్తున్నానని తెలిపారు. ఎన్నో అవమానాలు భరించా, తాను ఎదడానికి కారణం జర్నలిస్టులేనని తెలిపారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల అనుభవాలు, అభిప్రాయాలను ఇంటర్వ్యూ చేయాలని, ఒక పుస్తకం తేవాలని పలువురు సూచించారు. వచ్చే సంవత్సరం జాతీయ పత్రికా దినోత్సవం నాటికి వాటిని తీసుకొస్తామని ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. సమావేశంలో పలువురు సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్ర మూర్తి, దాసు కేశవరావు, రామారావు, జి.వల్లీశ్వర్, బండారు శ్రీనివాస్, పాశం యాదగిరి, మదన్ మోహన్ రావు, లక్ష్మణ్ రావు, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలి

రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తాం: డాక్టర్ భీమ్ రావు యశ్వంత్ అంబేడ్కర్



మాట్లాడుతున్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావు యశ్వంత్ అంబేడ్కర్

పంజాగుట్ట, నవంబరు15(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగే అన్ని ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్ రావు అంబేడ్కర్) జాతీయ అధ్యక్షుడు, బీఆర్ అంబేడ్కర్ మనవడు యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం వాటా, 2028లో తెలంగాణ బహుజన రాజ్యాధికారాన్ని సాధించడం ఎలా అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ విజీఆర్ నారగోని, ఆర్పీఐ (భీమ్‌రావు అంబేడ్కర్) పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ మేజర్ చంద్రకాంత్, మహాజన సేన పార్టీ అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్, ఆధార్ పార్టీ అధ్యక్షుడు ఈద శేషగిరిరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను అమలు చేయాలని యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. ఈవీఎంలకు, వీవీ ప్యాట్‌లకు వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని, అన్ని ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేసి ఢిల్లీకి పంపాలని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి తెలపాలని ఆయన సూచించారు. రాబోయే అన్ని ఎన్నికలలో పోటీ చేస్తామని, కలిసి వచ్చే పార్టీలతో కూటమి ఏర్పాటు చేస్తామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదించి అమలు చేయాలని అన్నారు. వచ్చే జనవరిలో నగరంలో భారీ సభ, ర్యాలీని నిర్వహిస్తామని ప్రొఫెసర్ వినోద్ కుమార్ తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంలో ముందుండాలి

దక్షిణ డిస్కం ఆపరేషన్స్ డైరెక్టర్ నరసింహులు



ఆనంద్‌నగర్ కాలనీ కరెంటోళ్ల ప్రజాబాటలో పాల్గొన్న డా.నరసింహులు, ఎస్‌ఈ వెంకన్న

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది ముందుండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ డా.నరసింహులు అన్నారు. ప్రజాబాటలో దృష్టికి వచ్చే సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్‌కాలనీలో శనివారం నిర్వహించిన కరెంటోళ్ల ప్రజాబాటలో పాల్గొని స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కవర్ కండక్టర్ తీగలు వేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విద్యుత్ లైన్ల నెట్‌వర్క్ వ్యవస్థతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ప్రకటనతో టీడీపీ మద్దతు

బోరబండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో టీడీపీ శ్రేణులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపాయని ఆ పార్టీ సీనియర్ నేత, హుడా మాజీ డైరెక్టర్ జాకబ్, సీనియర్ నాయకుడు జోసెఫ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అమీర్ పేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారని చెప్పారు.

వయోవృద్ధులను ఆదుకోవాలి

పంజాగుట్ట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక సంస్థలు ముందుకు రావాలని అసోసియేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ హైదరాబాద్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఆర్.ఎన్. మిట్టల్, మేనేజింగ్ ట్రస్టీ విఠల్ రావు, ప్రధాన కార్యదర్శి బుద్ధ ప్రకాష్, ట్రస్టీ బి.ఓం ప్రకాష్, తదితరులు మాట్లాడారు. నగరంలో సుమారు 30 లక్షలకు పైగా వృద్ధులున్నారని తెలిపారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అనేక సేవా కార్యక్రమా లు చేస్తున్నామన్నారు. దాతల ఆర్థిక సహాయం సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తమ సొంత డబ్బులు వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆరు ఓల్డ్ ఏజ్ హోమ్స్ నిర్వహిస్తున్నామని, మరో మూడు హోమ్స్‌ను ఎంపిక చేశామని అన్నారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మార్గదర్శకాల మేరకు వారికి అన్ని సౌకర్యాలు ఉండేలా ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

ఖైరతాబాద్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): అమాయకులను మోసం చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని.. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పించారు. శనివారం ఖైరతాబాద్ పోలీసు ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, సిబ్బంది డబుల్ బెడ్ రూం సముదాయంలో స్థానికులకు పలు సూచనలు చేశారు. ఉచితంగా ఇస్తామంటూ ఫోన్లు చేసి బ్యాంకు ఖాతా నెంబరు అడిగితే ఇవ్వొద్దని అన్నారు.

తెలియని లింక్స్ వస్తే ఓపెన్ చెయ్యొద్దని, చేస్తే వెంటనే ఖాతా నుంచి డబ్బు మాయమవుతుందని తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్, ఇతర యాప్స్ వాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైబర్ మోసాలపై అప్రమత్తం చేస్తూ పోలీసులు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ముద్రించిన కర పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

అధ్యక్షుడికి ఉచితంగా వచ్చిన 2 డిజిటల్ వాచీలు

పోలీసులు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తుండగా 2 బీహెచ్‌కె అధ్యక్షుడు అనిల్‌కు ఉచితంగా 2 డిజిటల్ వాచీలు గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన విషయం వెలుగులోకి వచ్చింది. వారు దానిపై సందేశం పంపి ఉచిత గిఫ్ట్‌పై ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని దానిని వాడాలంటే స్కాన్ చేయాలనడంతో ఆ విషయమై పోలీసులకు చెప్పి ఆ కంపెనీ ఎలాంటి ఉచిత గిఫ్ట్‌లు పంపదని నిర్ధారించుకున్న అనంతరం ఆ వాచీలను పోలీసులకు అందజేసి విచారించమని కోరారు.

కాంగ్రెస్ ప్రజా పాలనకు తీర్పు.. జూబ్లీహిల్స్ గెలుపు

టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



సుధాకర్‌గౌడ్

బంజారాహిల్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపు అని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ఎంత దుష్ప్రచారం చేసినా ఓటర్లు కుట్రలను పసిగట్టి, అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. ఉపఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సీఎం ఒకవైపు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, అభివృద్ధి సమీక్షలు చేస్తూనే, మరోవైపు కాంగ్రెస్ క్యాడర్ ను ఎన్నికల కోసం సమాయత్తపరిచి, నవీన్ యాదవ్ గెలుపుకు బాటలు వేశారని పేర్కొన్నారు. గత అసెం బ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా దూసుకెళుతున్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందని జూబ్లీహిల్స్ విజయం ద్వారా వెల్లడైందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల్లో పూర్తి సహకారం అందించారని గుర్తు చేశారు.



ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిసిన రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

'పదేళ్ల బీఆర్ఎస్ దుష్ట పాలనకు ఇది ప్రజల తీర్పు'

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా దుష్టపాలన చేసిందని.. అందుకు ప్రజలు ఆ పార్టీపై పూర్తి వ్యతిరేకంగా ఉన్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే రుజువని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ఆయన ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులను శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్క డివిజన్లో కూడా బీఆర్ఎస్ పార్టీకి ఆధిక్యం లభించలేదన్నారు. ఎర్రగడ్డ డివిజన్లో కాంగ్రెస్ పార్టీకి రెండువేల పైచిలుకు ఆదిత్యం లభించడం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశాడు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం ఛైర్మన్ మొహమ్మద్ మోసిన్ ఖురేషి, సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ నాయక్, భాస్కర్, పి ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలి : కళ్లెం

ఎర్రగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏమీ లేదని సంఘ సేవకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల జింఖానా గ్రౌండ్లో జరిగిన దేవేందర్ యాదవ్ మెమోరియల్ అథ్లెటిక్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను ఆయన కోచ్ అనిల్ తయ్యప్పతో కలిసి శనివారం ఎర్రగడ్డ జి టి ఎస్ గ్రౌండ్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల పరుగు పందెంలో అక్షయ మొదటి స్థానంలో నిలిచిందని, కిలోమీటర్ పరుగుపందెంలో కే.దీన మూడో స్థానంలో నిలిచి పథకాలను సొంతం చేసుకున్నారని ఆయన కొనియాడారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో జిల్లా, రాష్ట్రస్థాయిలో కూడా పథకాల సాధించాలని కోరారు.

నాణ్యతతో కూడిన వైద్యం అందించాలి

అమీర్‌పేట, నవంబరు 15 ఆంధ్రజ్యోతి): చికిత్స పద్ధతుల్లో కొత్త వాటిని అందిపుచ్చుకుని నాణ్యతతో కూడిన వైద్యం అందించాలని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ హరికుమార్ రెడ్డి అన్నారు. చికిత్స పద్ధతుల్లో కొత్త మార్పులు, 21వ శతాబ్దంలో వైద్యం తీరుతెన్నులపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఏదైనా ఆరోగ్య సమస్యలతో వచ్చిన రోగులకు కేవలం చికిత్సలు అందించడమే కాకుండా ఆ సేవల్లో నాణ్యతకు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రశ్మీ కామత్, జార్జ్, అపోలో ఆసుపత్రి సేఫ్టీ అండ్ పేషెంట్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ లోరిక్, ఉషారాణి, హర్షిణి, హృతిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సికింద్రాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జనరల్ బజార్ ఏఈ రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఓల్డ్‌గాస్‌మండి, పాన్‌బజార్, రాణిగంజ్, లాలాగుడి, బాంబే హోటల్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే



అమ్మగూడ శక్తినగర్‌లోని శక్తి వినాయక దేవాలయంలో శనివారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు.

- సికింద్రాబాద్, (ఆంధ్రజ్యోతి)



లోక్ అదాలత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి శ్యామ్ కోశి

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

● హైకోర్టు జడ్జి శ్యామ్ కోశి

అడ్డగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని హైకోర్టు జడ్జి శ్యామ్‌కోశి అన్నారు. సికింద్రాబాద్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీయే రాజామార్గమని, పెండింగ్ కేసులను పొడగించకుండా రాజీకి రావాలని కక్షిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి షమ్‌శ్రీ, 27వ అదనపు జడ్జి కృష్ణ, 3వ అదనపు సెషన్ జడ్జి రాజ్‌కుమార్, ఐజేసీజే జడ్జి ప్రియాంక, సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు వసంత్‌కుమార్, టీవీ రమణ, యోగేశ్వర్‌రావు, సీఎస్ శ్రీకాంత్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



నిలిచిన కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, తదితరులు

కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

● బోయినపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

సికింద్రాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రసూల్‌పురా కట్టమైసమ్మ కృష్ణానగర్ బస్తీలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్‌ను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. గతంలో సాయన్న ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.50లక్షల నిధులతో కమ్యూనిటీ నిర్మాణం ప్రారంభమైందని గుర్తు చేశారు. ఆ తర్వాత నివేదిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కమ్యూనిటీ హాల్‌కు రూ.18లక్షల నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక చొరవ తీసుకుని కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట దేవులపల్లి శ్రీనివాస్, శ్యామ్‌రెడ్డి, కుమార్‌గౌడ్, పోచమ్మ, ఎల్లమ్మ, శారద పాల్గొన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి

సికింద్రాబాద్/ బౌద్ధనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల సహాయ అధికారులు ఏఆర్ కృష్ణవేణి, చాముండేశ్వరి, సూపరింటెండెంట్ కవిత తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ, సర్కిల్ 8 పరిధిలో కొత్తగా 8వేల రేషన్ కార్డులు, 9వ సర్కిల్‌లో ఆరువేల కార్డులు ఇచ్చామన్నారు. నూతన లబ్ధిదారులు కేవైసీ చేయించుకోవాలని, లేని పక్షంలో రేషన్ సరుకులు పొందే అవకాశాన్ని కోల్పోతారని వారు అన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

సికింద్రాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సీతారాంపురం కాలనీలోని శివపంచాయతన హనుమాన్ ఆలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండుగా జరిగింది. ఆలయ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కల్యాణోత్సవంలో పాల్గొని పూజారుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, సురేష్, విజయ్‌బాబు, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ప్లాట్ రిజిస్ట్రేషన్

● కబ్జాకు యత్నం.. అరెస్ట్

ఉప్పల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లతో ప్లాటును రిజిస్ట్రేషన్ చేయించుకొని కబ్జా చేసేందుకు యత్నించిన ముఠా సభ్యులను ఉప్పల్ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ కొత్తపేటలో నివాసముండే విజయకుమారికి 1993లో తన పుట్టింటివారు కట్నం కింద ఉప్పల్ సాయిబాబా కాలనీలో 200 గజాల ప్లాటును ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఆ ప్లాటుపై కబ్జా దారుల కన్నుపడింది. పథకం ప్రకారం.. ప్లాటు యజమాని చనిపోయినట్లుగా నకిలీ డెత్ సర్టిఫికెట్ తయారుచేసి ఆమెకు వారసురాలిగా ఆమె కూతురు రమ్య ఉన్నట్లుగా నకిలీ వ్యక్తిని సిద్ధం చేసి, ఆమె పేరుతో వారసురాలి సర్టిఫికెట్ తయారు చేశారు. రమ్య నుంచి ఆ ప్లాటును ఉప్పల్‌కు చెందిన రచల వెంకటరమణ పేరు మీద, ఆ తర్వాత రంగ సతీష్ గౌడ్ పేరు మీద ఉప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ ప్లాటులో మరో 100 గజాల స్థలాన్ని చాకలి లక్ష్మీదేవికి అమ్మారు. దీంతో ఆమె ప్లాటు వద్దకు వెళ్లే సరికి ప్లాటు అసలు యజమాని అక్కడికి చేరుకోవడంలో తాను మోసపోయిన విషయాన్ని తెలుసుకొని న్యాయం కోసం ఆమె ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముగ్గురు నిందితులు గతంలో అనురాధ రగురామ్ అనే వ్యక్తి బతికుండగానే చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి అతని ప్లాటును ఉపేందర్ అనే వ్యక్తికి అమ్మినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో నిందితులకు సహకరించిన కార్తీక్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ముురుగు.. పరుగు

పద్మారావునగర్‌లో రోడ్డుపై డ్రైనేజీ నీరు

ఇబ్బంది పడుతున్న స్థానికులు

పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

పద్మారావునగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై నిత్యం మురుగు నీరు ప్రవహించడంతో పద్మారావునగర్ పరిసర ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలువకుండా కాలువ గోడకు పలు చోట్ల రంధ్రాలు చేశారు. దీంతో మురికి నీరు రోడ్డుపై చేరి పలు కాలనీల్లో నీరు నిలుస్తోంది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కాలువ గోడకు చేసిన రంధ్రం నుంచి పారుతున్న మురుగు నీరు

రహదారులపై మురుగు నీరు..

బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని గాంధీ ఆస్పత్రి వెనుక రోడ్డు పక్కన గల ఓపెన్ నాలాలో ఓవర్ ఫ్లో కారణంగా మురికి నీరు రోడ్డుపై చేరుతుంది. అదే విధంగా పద్మారావునగర్ పార్కు, వెంకటాపురం కాలనీల్లోనూ మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇటీవల బహుళ అంతస్తుల భవనాల నుంచి మురుగు నీరు అధికంగా రావడం.. డ్రైనేజీ పైపులైన్లు పాతవి కావడంతో వాటిపై ఒత్తిడి పెరిగి రోడ్డుపైకి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. రహదారులపై మురుగు నీరు నిల్వడంతో దోమలు విజృంభిస్తున్నాయని, ఫలితంగా తాము జ్వరాల బారిన పడుతున్నామని అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరుతున్నారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి



గాంధీ ఆస్పత్రి వెనుక రోడ్డు పక్కన గల ఓపెన్ నాలా కారణంగా రోడ్డుపై నిత్యం మురుగు నీరు ప్రవహిస్తోంది. కాలువ గోడకు పలు చోట్ల రంధ్రాలు చేయడంతో మురికి నీటి సమస్య పెరిగింది. సంబంధిత అధికారులు స్పందించి కాలువ గోడకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలి. **- రమేశ్, స్థానికుడు, వెంకటాపురం కాలనీ**

కొత్త డ్రైనేజీ పైపులు వేయాలి



వెంకటాపురం కాలనీలో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులు లీకై మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో కాలనీవాసులు, పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పెద్ద సైజు పైపులు వేయాలి.

- శ్రీనివాస్, స్థానికుడు, వెంకటాపురం కాలనీ

విద్యార్థి దశ నుంచే సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రెజిమెంటల్‌బజార్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్షమాగుణం, కరుణ, వ్యక్తిత్వం, మానవత్వం, సేవా గుణాన్ని అలవరచుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సూచించారు. దేశానికి మంచి పౌరులు అవసరమని ఆయన అన్నారు. శనివారం సికింద్రాబాద్ సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్ 114వ వార్షికోత్సవానికి గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య మనసుకు మాత్రమే కాదని, హృదయానికి విద్య అవసరమని అన్నారు. తెలంగాణ గవర్నర్‌గా ఈ వార్షికోత్సవానికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. గవర్నర్ జెస్యూట్ సంస్థతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను డార్జిలింగ్ నార్త్ పాయింట్‌లోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో 2 నుంచి 11వ తరగతి వరకు చదువుకున్నట్టు తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. యూనివర్సిటీలలో కాన్వొకేషన్ కార్యక్రమాలకు వెళ్లినపుడు 70 శాతం గోల్డ్ మెడలిస్ట్‌లు బాలికలు ఉంటున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏపీ అదనపు కార్యదర్శి, హైదరాబాద్ మాజీ కలెక్టర్ డా.చెల్లప్పను జీవిత సాఫల్య పురస్కారంతో గవర్నర్ సత్కరించారు. అధ్యక్షుడు ఫాదర్ స్టానిస్లాస్, కరస్పాండెంట్ ఫాదర్ ఆరోకియ సామి, ప్రిన్సిపాల్ ఫాదర్ ఎలాంగో, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి

● ప్రొ. హరగోపాల్



రక్తదాన శిబిరానికి హాజరైన ప్రొ.హరగోపాల్, డీఈఓ రోహిణి, డీఆర్‌ఓ వెంకటాచారి తదితరులు

చిలకలగూడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మారేడ్‌పల్లి మండల ఉప విద్యాధికారి బాలునాయక్ ఆధ్వర్యంలో శనివారం చిలకలగూడ విద్యా విహార్ హైస్కూల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర విద్యా సలహా మండలి సభ్యులు ప్రొ. హరగోపాల్, జిల్లా విద్యాధికారి రోహిణి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, మండల పర్యవేక్షణాధికారి మదన్‌మోహన్‌రెడ్డి, రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షుడు భీమ్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొ.హరగోపాల్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. సామాజిక సేవలో ఉపాధ్యాయులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. డీఈఓ రోహిణి మాట్లాడుతూ, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయొచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మిగతా మండలాల్లోనూ అమలయ్యేలా చూస్తానని డీఈఓ అన్నారు. అనంతరం మారేడ్‌పల్లి మండల ఉత్తమ ఉపాధ్యాయులను, పలువురు దాతలను సన్మానించారు. 81 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మారేడుపల్లి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ఏసీపీ సుబ్బయ్య



అంబేడ్కర్ బస్తీలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ బుర్రి చిట్టి

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ

● ఏసీపీ సుబ్బయ్య

అడ్డగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య విద్యార్థులకు సూచించారు. మారేడుపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తుకారాంగేట్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ, విద్యార్థులు లోన్ యాప్‌లో జోలికి వెళ్లకూడదని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఏ బ్యాంకు వారు కూడా ఓటీపీ అడగరని, గుర్తు తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పకూడదని ఆయన విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై ఏదైనా అపాయం ఏర్పడితే వెంటనే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తుకారాంగేట్ ఎస్ఐలు రామకృష్ణ, రమ్య, కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగర్‌లో..

గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ చెబితే మీ బ్యాంకులో డబ్బు మాయమైనట్టేనని లేక్ పోలీస్‌స్టేషన్ సీఐ బుర్రి చిట్టి అన్నారు. లేక్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ డబుల్‌బెడ్ రూం కాలనీలో శనివారం సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫోన్‌ను జాగ్రత్తగా ఉపయోగించాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఇన్‌స్పెక్టర్ డెబోరా



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ డెబోరా

పద్మారావునగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సెంట్రల్ జోన్ లకడీ కాపూల్ మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ డెబోరా అన్నారు. బన్సీలాల్‌పేట్, బోయగూడ ఐడీహెచ్ కాలనీలో శనివారం తెలంగాణ పోలీస్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ వుమెన్ (సీడీఈడబ్ల్యూ) ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ టీం, షైచాయిస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ డెబోరా మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు గృహహింస, లైంగిక వేధింపులు, వివాహ, కుటుంబ సభ్యులతో బాధపడుతున్నారన్నారు. ఆ సమస్యను ఎవరికి చెప్పాలో తెలియని సందిగ్ధ అవస్థలో ఉంటున్నారన్నారు. అలాంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి సీడీఈడబ్ల్యూ కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. మహిళలు పీఎస్‌కు రావడం లేదా 9333404141కు వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటారని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ చందన, వెంకటేశన్ రాజు, శ్రీనివాస్, వెంకటేశ్, లంక రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి

● ఓయూ జాతీయ సదస్సులో వక్తలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఏఐ లిటరసీ అవసరమని, బోధకులు కూడా ఏఐ నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ మైనారిటీస్ సెల్ ఆధ్వర్యంలో "ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ ఇన్ ది ఎరా ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే అంశంపై శనివారం జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ డా.ఎ.అశోక్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మొయిజ్, వి-ఇన్‌స్పైర్ సీఈఓ డా.అబ్దుల్‌వాసీ మహమ్మద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న డిజిటల్ మార్పులు, అంతర్జాతీయ అనుసంధానం, ఏఐ ప్రభావం నేపథ్యంలో నూతన విద్యా విధానాలు సమాజానికి, విద్యార్థులకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. సదస్సులో 150 మంది పైగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. 50 కంటే ఎక్కువ పరిశోధనా పత్రాలు కూడా సమర్పించారు. కార్యక్రమంలో యూసీఎస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, విద్యా నిపుణురాలు మోసీనా మీర్జా, డైరెక్టర్లు ప్రొఫెసర్ మల్లప్ప లింగప్ప, ప్రొఫెసర్ ఐ.డైసీ, డా.ఉపేందర్, ప్రొఫెసర్ హమీదా పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబర్ 7 వద్ద సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా కేసు దర్యాప్తులో ఉంది.

రెడీమిక్స్ లారీ ఢీకొని మహిళ మృతి

నిజాంపేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) లారీ ఢీకొని మహిళా ఉద్యోగి మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగర శివారులోని నల్లగండ్లలో నివాసముంటున్న ఉదయ్ కిషోర్, చొప్పల్లి తేజశ్విని(34) దంపతులు ప్రైవేట్ ఉద్యోగులు. బాచుపల్లిలోని రెడ్డి ల్యాబ్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తేజశ్విని రోజూ ఉదయం 8 గంటలకు డ్యూటీకి వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఇంటికి తిరిగి వస్తుంది. రోజు మాదిరిగానే శనివారం ఉదయం 8 గంటలకు స్కూటీపై డ్యూటీకి బయలుదేరింది. 8.30 గంటలకు బొల్లారం చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి దూసుకొచ్చిన రెడీమిక్స్ కాంక్రీట్ లారీ(టీజీ 15 టీ 1803) ఆమెకు ఎడమవైపు నుంచి ఓవర్ టేక్ చేస్తూ ఢీకొట్టింది. తేజశ్వినిపై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న భర్త ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ నజీముద్దీన్ మజుందార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సన్మాన గ్రహీతలు, సీనియర్ పాత్రికేయులతో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

జర్నలిజం విలువలు కాపాడాలి: దత్తాత్రేయ

పంజాగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిజం చాలా పవిత్రమైనదని, ఈ రంగంలో విలువలు కాపాడాలని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా బండారు వైష్ణవ్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిజం రంగంలో విశిష్ట సేవలను అందించిన పలువురు జర్నలిస్టులను ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పత్రికారంగంలో నిజాయితీ, నిబద్ధత, విలువలు, వాస్తవాన్ని నిలబెట్టే జర్నలిస్టులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. తాను గవర్నర్‌గా ఉన్న సమయంలోనూ రాజ్‌భవన్‌లో పలువురు జర్నలిస్టులను సన్మానించానని, ప్రస్తుతం అదే సంప్రదాయం కొనసాగిస్తున్నానని తెలిపారు. ఎన్నో అవమానాలు భరించా, తాను ఎదడానికి కారణం జర్నలిస్టులేనని ఆయన అన్నారు. భావి జర్నలిస్టులకు కూడా విలువలు నేర్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధిలో జర్నలిస్టుల భాగస్వామ్యం ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, పలువురు సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, దాసు కేశవరావు, రామారావు, వల్లీశ్వర్, శ్రీనివాస్, పాశం యాదగిరి, మదన్‌మోహన్ రావు, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జునరావు, రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్, హరిప్రసాద్, ప్రసాద్, సలీం తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.శేషగిరిరావుగౌడ్ తదితరులు

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే బీజేపీ గెలుపు

● ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడు డా.భీమ్‌రావు యశ్వంత్ అంబేడ్కర్

బర్కత్‌పుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను ట్యాంపిరంగ్ చేయడం వల్లనే బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్‌రావ్ అంబేడ్కర్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమ్‌రావు యశ్వంత్ అంబేడ్కర్ ఆరోపించారు. ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆధార్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి ఈవీఎంలను రద్దు చేయాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా నవంబర్ 21న చెన్నైలో సభ, డిసెంబర్‌లో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ, జనవరి 3న హైదరాబాద్‌లో సభలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.శేషగిరిరావుగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక న్యాయం సాధించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ బీసీలు ఏకమై బహుజన రాజ్యాన్ని స్థాపిస్తామని ఆయన చెప్పారు.